సాక్షి వనపర్తి

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



ఉత్సవాలకు ముస్తాబు
పేదల తిరుపతి అమ్మాపురం కురుమూర్తి స్వామి క్షేత్రాన్ని బ్రహ్మోత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు.

-8లో ▸



జూరాలకు నిలకడగా వరద
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1.15 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందని అధికారులు తెలిపారు.

-8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.2 /21.2

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్థానిక సంస్థల ఎన్నికల్లో కోర్టు తీర్పు కీలకం



వనపర్తి రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కోర్టు తీర్పు కీలకం కానుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాణిక్యం అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని వివరించారు. పార్టీ పట్ల విధేయత, నాయకుడి పట్ల విశ్వాసం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. నియోజక వర్గంలో మెజార్టీ సీట్లు గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భానుప్రకాష్‌రావు, విజయ్‌కుమార్, మతీన్, రఘువర్ధన్ రెడ్డి, రవి ప్రకాష్‌రెడ్డి, ధర్మానాయక్, మాదవరెడ్డి, నందిమల్ల అశోక్, నరసింహ, టీక్యా నాయక్, చిట్యాల రాము, ధర్మశాస్త్రి, కృష్ణా నాయక్, మోతిలాల్‌నాయక్ పాల్గొన్నారు.

చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి



వనపర్తి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీడీపీఓ హాజీరా బేగం సూచించారు. పోషణ మాసం సందర్భంగా సోమవారం మండలంలోని చిమనగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి వారి ఎదుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పౌష్టికాహారం అందించడంతో పాటు వారు తీసుకుంటున్న ఆరోగ్య జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు.

సుప్రీంకోర్టు సీజేఐపై దాడి హేయమైన చర్య

గద్వాల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై సోమవారం కోర్టుహాలులో జరిగిన దాడి హేయమైన చర్య అని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రజాసంఘాలు, దళిత, ఉపాధ్యాయ, బహుజన సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్‌చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఓ కేసు విచారణలో జరుగుతున్న వాదనల క్రమంలో ఓ మతాన్ని వంటపట్టించుకున్న ఓ మతోన్మాది అయిన న్యాయవాది దేశంలోనే అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించడం క్షమించరానిదని ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదన్నారు. దాడికి యత్నించిన న్యాయవాదిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, వాల్మీకి, హనుమంతు, ప్రభాకర్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, పల్లయ్య, రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాకొద్దు.. ఇందిరమ్మ ఇల్లు!

లబ్ధిదారుల్లో రోజురోజుకూ పెరుగుతున్న అనాసక్తి



- మంజూరును రద్దు చేయాలని అధికారులకు వినతి
- నిర్మాణం ప్లానింగే కారణమా?
- ఎన్నికల సాకుతో పెండింగ్‌లో మంజూరు రద్దు వినతులు

వనపర్తి: ఇల్లు నిర్మించేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందంటే.. మూకుమ్మడిగా ఇల్లు లేని కుటుంబాల ప్రజలు ఎగబడటం ఇప్పటి వరకు చూశాం. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు సైతం దాదాపుగా ఇలాంటి పరిస్థితి నెలకొంది. తొలి విడతలో అత్యంత పేద కుటుంబాలకు ఇల్లు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ పేర్కొన్న విషయం విదితమే. కానీ ఇంటి నిర్మాణం విషయంలో గృహ నిర్మాణశాఖ పెట్టిన షరతులను సహించలేక కొందరు లబ్ధిదారులు ఈ ఇందిరమ్మ ఇళ్లు మాకొద్దు.. మంజూరును రద్దు చేయాలంటూ అర్జీలు దాఖలు చేస్తున్న ఘటనలు జిల్లాలో వెలుగుచూస్తున్నాయి. తొలి విడతలో జిల్లాకు 6,538 మంజూరు చేయగా.. వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయి. నిబంధనలు నచ్చని సుమారు 150 మంది మంజూరును రద్దు చేయాలని కోరుతూ సంబంధిత అధికారులకు అర్జీలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల కారణంగా.. ఈ సమయంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేస్తే ప్రభుత్వానికి, పాలకులకు అప్రతిష్ట కలుగుతుందని భావించిన అధికారులు ఎన్నికల వేళ మంజూరు రద్దు ప్రక్రియ చేయటం సాధ్యం కాదని పెండింగ్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. పదిహేను రోజుల క్రితమే తమకు మంజూరైన ఇళ్లను రద్దు చేయాలంటూ జిల్లాలోని ఆయా ప్రాంతాల లబ్ధిదారులు అర్జీలు దాఖలు చేసినా.. అధికారులు వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారులకు వివరించాం



జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన కొందరు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి మంజూరును రద్దు చేయాలని కోరారు. వారి అభ్యర్థనల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

– విటోభా, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి, వనపర్తి

ఆది నుంచి సమస్యలే..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం విషయంలో అధికారులు ఇచ్చిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. లేదంటే బిల్లులు చేయటం అసాధ్యం. వారిచ్చిన కొలతల ప్రకారమే ప్లాటులోని భూమిని ఎంచుకోవాలి. గదుల నిర్మాణం, గోడల సైజులు, తలుపులు, కిటికీల నిర్మాణంతో పాటు గతంలో పాత బేస్‌మెట్ ఉన్నా.. తొలగించి కొత్తగా నిర్మాణం చేయక తప్పదు. వనపర్తి మండలంలోని అప్పాయిపల్లిలో మునుపు నిర్మాణం చేసిన బేస్‌మెంట్‌పై ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులు చేపట్టారని ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్) సాంకేతికతను ఉపయోగించి ఇంజినీరును, పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. అంతకంటే ముందు వనపర్తి మున్సిపాలిటీలో అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి లబ్ధిదారుల ఎంపిక చేశారని మున్సిపల్ మేనేజర్, వార్డు ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు. దీంతో నిబంధనలను అధికార సిబ్బంది బృందం కఠినతరం చేయటంతో.. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో ఇల్లు నిర్మాణం పూర్తి చేయలేమని భావించిన లబ్ధిదారులు వెనకడుగు వేస్తున్నారు. చేతి నుంచి కొంత డబ్బును వెచ్చించి వారిచ్చిన ప్లానింగ్‌లో ఇళ్లు కట్టుకోవటం ఎందుకని వద్దనుకుంటున్నట్లు తెలుస్తోంది.

నెమ్మదించిన నిర్మాణాలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సామగ్రి ధరలు, ఇసుక సమస్యలు వెంటాడుతున్నాయి. దీనికి తోడు సాంకేతిక కారణాలతో బిల్లుల చెల్లింపులో జాప్యం తదితర కారణాలతో జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతి నెమ్మదించినట్లుగా అధికారిక లెక్కలను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. తొలి విడతలో జిల్లాలో 6,538 ఇళ్లను కేటాయించగా 6,206 ఇళ్లకు కలెక్టర్ ఆమోదం లభించింది. ఇందులో 1,627కు మార్క్ అవుట్ చేశారు. వాటిలో 1,582 బేస్‌మెంట్ లెవల్‌లో, 370 రూఫ్ లెవల్‌లో, 309 ఆర్సీ లెవల్‌లో ఉండగా.. ఇప్పటి అధికారికంగా వందశాతం ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేసింది కేవలం 7 కావటం గమనార్హం.

సమీకృత న్యాయస్థాన భవనంతో మేలు



తెలంగాణ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను సన్మానిస్తున్న వనపర్తి బార్ అసోసియేషన్ సభ్యులు

వనపర్తిటౌన్: నూతన న్యాయస్థాన భవన సముదాయంతో కక్షిదారులు, ప్రజలకు ఎంతోలాభం చేకూరనుందని వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.కిరణ్ కుమార్ అన్నారు. 20 ఎకరాల్లో 10+2 కోర్టు(పోక్సో, ఫ్యామిలీ కోర్టు కాంప్లెక్స్) భవన సముదాయాన్ని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. రూ. 81కోట్లతో నిర్మించనున్న న్యాయస్థానానికి వర్చువల్‌గా 5వ, తేదీన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను సోమవారం వనపర్తి బార్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్‌లో కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, సీనియర్ న్యాయవాదులు గోపాల్ రెడ్డి, కె.తిరుపతయ్య, ఎండీ నిరంజన్ బాబా, నాచనల్లి రాజు, రామన్న గారి వెంకటేశ్వరరెడ్డి, నరేందర్ బాబు, ఎంఏ కలీం, తరుణ్, మల్లేష్ యాదవ్, సా యి కృష్ణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

టన్ను చెరుకుకు రూ.6 వేల ధర ఇవ్వాలి



కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీ జీఎంకు వినతిపత్రం అందిస్తున్న రాజన్న

అమరచింత: కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ.7వేల మద్దతు ధర ఇచ్చినట్లుగానే టన్ను చెరుకుకు రూ.6 వేల మద్దతు ధర ప్రకటించాలని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. దీంతో పాటు ఈ సంవత్సరం చెరుకు రైతులకు కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీ ఇస్తున్న సబ్సిడీలను వచ్చే ఏడాది కూడా వర్తింపచేయాలని కోరారు. చెరుకు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రైతులతో కలిసి ఫ్యాక్టరీ జీఎం వీపీ రామరాజుకు వినతిపత్రం అందించారు. అనంతరం ఫ్యాక్టరీ సిబ్బందితో కలిసి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంఘం వినతి మేరకు కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీ యాజమాన్యం గతేడాది నుంచి చెరుకు రైతులకు పంటలపై సబ్సిడీలను అందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీలను 2026–2027 సీజన్‌లో కూడా వర్తింపచేయాల్సిన అవసరం ఉందన్నారు. పెరిగిన ధరల ప్రకారం కంపెనీ ఇస్తున్న బోనస్‌తో కలిపి టన్ను చెరుకుకు రూ.ఆరు వేల మద్దతు ధరను ఇవ్వాలన్నారు. చెరుకు రైతులకు ఇబ్బంది లేకుండా ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులను ముందస్తుగా రప్పించి, పంట కోతలు పూర్తి చేసి వెంటనే డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలను పరిష్కరిస్తామని, సబ్సిడీలను వచ్చే సంవత్సరం కూడా కొనసాగిస్తామని ఫ్యాక్టరీ జీఎం హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు వాసారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణ, రాజశేఖర్, చంద్రసేనారెడ్డి, రంగారెడ్డి, శాలిమియా, మహేంద్రచారి, వీరన్న, రవి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ రామేశ్వర్‌రావు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రామేశ్వర్‌రావు

అమరచింత: ఎన్నికల నిర్వహణలో అతిముఖ్యమైన పోలింగ్ ప్రక్రియ రోజు అప్రమత్తంగా ఉంటూ ఓటరు తన ఓటు హక్కును సద్వినియోగించుకునే విధంగా చూడాలని పీఓ, ఏపీఓలకు జెడ్పీ డిప్యూటీ సీఈఓ రామేశ్వర్‌రావు సూచించారు. ఎన్నికల నిర్వహణపై మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు వచ్చిన వారిని నిశితంగా పరిశీలించి, వారి వయస్సుపై అనుమానం ఉంటే సంబంధిత అధికారులకు తెలియ పర్చాలన్నారు. వృద్ధులు, దివ్యాంగుల వ్యవహారంలో సానుకూలంగా ఉండి వారు ఓటు హక్కును సద్వినియోగించుకునే విధంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అఫ్జలుద్దీన్, తహసీల్దార్ రవికుమార్ యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ భాస్కర్ సింగ్, ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

జడ్చర్ల టౌన్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్–19 బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలను మంగళవారం జడ్చర్లలోని మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి డా.శారదాబాయి తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు పదో తరగతి మెమో, ఆధార్, బోనఫైడ్ జిరాక్స్‌లతో రావాలని సూచించారు. ఉదయం 9 గంటలకు మిని స్టేడియంలో రిపోర్టు చేయాలని, ఇతర వివరాలకు 9985375737 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రేపు ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని డీఎస్ఏ స్టేడియంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్–19 బాలబాలికల కబడ్డీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి మెమో, బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు నాలుగు ఎలిజిబిలిటి ఫారాలతో ఉదయం 9 గంటలకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్‌కు రిపోర్టు చేయాలని ఆమె సూచించారు.

కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



వనపర్తిలోని మెడికల్ కళాశాల దగ్గర కార్మికులతో మాట్లాడుతున్న సురేష్

వనపర్తి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలు యజమాన్యాల కుట్రలో నిర్వీర్యం కాకుండా పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పీ.సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య, సెక్యూరిటీ కార్మికుల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య, సెక్యూరిటీ కార్మికులకు లేబర్ జీఓ కాకుండా పీఆర్సీ జీఓ 60 అమలు చేయడంతో కార్మికులకు రూ. 15,600 వేతనాలు పెంచుతున్నట్లు ప్రభుత్వ కాగితాల్లో అంకెలు చూపుతున్నా, దొడ్డి దారిన యజమాన్యాలకు అనుకూలంగా సర్క్యులర్ జారీ చేసి క్షేత్రస్థాయిలో కార్మికులకు తీరని అన్యాయం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీల కాలపరిమితి ముగిసిందని, ప్రస్తుత ప్రభుత్వం రూ.26 వేలు కనీస వేతనం నిర్ణయించి జీఓ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పాలకుల ఉదాసీన వైఖరి ఫలితంగా 2012 నుంచి నేటి వరకు కనీస వేతన జీఓ 68, 43లు సవరణకు నోచుకోలేదని, దీంతో కార్మికులు తీవ్రమైన ఆర్థిక శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఎస్ వరుణ్, మన్నెమ్మ, చెన్నమ్మ, సుధ, శోభ, శారద, లావణ్య, శివలీల, రాజేశ్వరి, నారమ్మ, బొజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజ్ గౌడ్

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం.నాగరాజ్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఈర్లదిన్నె, నాగల్‌కడ్మూర్, పాంరెడ్డిపల్లె, మస్తీపురం గ్రామాలలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పేదలకు అందించి ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను నిర్ణయించేది కాంగ్రెస్ పార్టీ అధిష్టానమని, అక్కడి నుంచి అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, మహేందర్ రెడ్డి, నాయకులు చుక్క ఆశిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు, కరపత్రాల ముద్రణలో నిబంధనలు పాటించాలి



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

వనపర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచార పోస్టర్లు, కరపత్రాల ముద్రణలో ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎస్.ఖీమ్యానాయక్ ప్రింటింగ్ ప్రెస్ యజమానులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో జారీ కానున్న నేపథ్యంలో సోమవారం జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించి ప్రచార సందర్భంగా కరపత్రాలు, పోస్టర్ల ముద్రణలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ప్రచార సామగ్రి అయిన పోస్టర్లు, కరపత్రాల్లో ఎక్కడ కులం, మతపరమైన అంశాలను ప్రస్తావించరాదని, అదేవిధంగా వ్యక్తిగత విమర్శలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పబ్లిషర్ నుంచి ఫారం ఏ లో డిక్లరేషన్ తీసుకోవాలని, ఫారం ఏ, బీ తో పాటు ముద్రించిన 4 కరపత్రాలను జతపరచి మండల కార్యాలయానికి లేదా కలెక్టరేట్‌కు పంపించాలన్నారు. ముద్రించిన కరపత్రం లేదా వాల్‌పోస్టర్‌పై ప్రింటింగ్ ప్రెస్ పేరు, చిరునామా ఖచ్చితంగా పేర్కొనాలని, ఎన్ని పేజీలు ముద్రించారు, అందుకు తీసుకున్న పైకం ఎంత అనే వివరాలు ఫారం–బీ లో చూపెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సీతారాం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సెక్షన్ సూపరింటెండెంట్ మదన్‌మోహన్, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

పాన్‌గల్: స్థానిక సంస్థలు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యానాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్నికల విధులు నిర్వహించే పీఓ, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ తరగతులను జేసీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి రాజకీయ ఒత్తిడిలకు గురికాకుండా వివాదరహితంగా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాల పనితీరు, డిస్ట్రిబ్యూషన్, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్‌లు తెరవడం, బాక్స్‌లను సీజ్ చేయడం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శిక్షణలో టెండర్ బ్యాలెట్, చాలెంజింగ్ ఓట్లపై ఆర్పీలు అవగాహన కల్పించారు. శిక్షణకు 34 మంది పీఓలు, 61 మంది ఏపీఓలు హాజరయ్యారు. రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో రెండో రోజు పంచాయతీ ఎన్నికలపై శిక్షణ ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ ఉమాదేవి, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు, ఏపీఓ కుర్మయ్య, ఆర్‌ఐలు మహేష్, తిరుపతయ్య, సిబ్బంది మల్లేష్, శివరామ్ పాల్గొన్నారు.

పీఓల పాత్ర కీలకం

ఖిల్లాఘనపురం/గోపాల్‌పేట: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పీఓల పాత్ర కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ) యాదయ్య అన్నారు. సోమవారం ఖిల్లాఘనపురం, గోపాల్‌పేట మండల కేంద్రాల్లో పీఓ, ఏపీఓలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన టీఓటీలతో మాట్లాడారు. శిక్షణకు వచ్చిన పీఓ, ఏపీఓలకు ఎన్నికలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఫారం, బ్యాలెట్ బాక్సు నిర్వహణ తదితర అన్ని విషయాల గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎంపీడీఓ సునీత, ఎంఈఓ జయశంకర్ మాట్లాడుతూ సోమవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పీఓ, ఏపీఓలకు మాత్రమే శిక్షణ ఇచ్చామని, మంగళవారం సర్పంచుల ఎన్నికలకు సంబంధించిన పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, టీఓటీలు తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదయ్య

ఎర్ర మట్టి అక్రమ తరలింపు



కిష్టాపూర్‌తండా సమీపంలో ఎర్ర మట్టి కోసం ఆగిన టిప్పర్లు

- చోద్యం చూస్తున్న మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు
- తండావాసుల ఫిర్యాదుతో వెలుగులోకి..

పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్‌తండా సమీపంలోని సర్వే నంబర్ 34లో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు ఇష్టానుసారంగా ఎర్రమట్టిని తరలిస్తున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసులు అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తండావాసులు ఆరోపిస్తున్నారు. కొన్ని రోజుల నుంచి మిషన్లు పెట్టి టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకోవడంతో పాటు పర్యావరణానికి భంగం కలిగించడం, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా అధికారులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నిత్యం టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ రోడ్లను ధ్వంసం చేస్తుండడంపై మండల అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించకపోవడంతో సోమవారం తండావాసులు జిల్లా మైనింగ్, ఎస్పీకి ఫిర్యాదు చే యడంతో అక్రమ మట్టి దందా వెలుగులోకి వ చ్చింది. తండావాసుల ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు మట్టి తవ్వే ప్రాంతాన్ని ఆకస్మికంగా సందర్శించి, వివరాలు సేకరించినట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం..

మట్టి తవ్వకానికి ఎవరికి అనుమతులు ఇవ్వలేదు. సర్వే నంబర్ 34లో ప్రభుత్వ భూమి ఉండడంతో కొందరికి అసైన్‌మెంటు పట్టాలు ఇచ్చాం, అందులో కొంత భాగం మిగులు భూమి కూడా ఉంది. దీంతో పాటు కొంత పట్టా భూములు కూడా ఉన్నాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిలోనా లేక పట్టా భూమిలో తవ్వారా అనే విషయాలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్

క్లుప్తంగా

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య


నాగమ్మ(ఫైల్)

తిమ్మాజీపేట: మనస్తాపంతో ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దొంగ నాగమ్మ(47) భర్త అంజనేయులుకు ఇటీవల చిన్నపాటి గొడవ జరిగింది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన నాగమ్మ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్య ఘటనపై ఎలాంటి అనుమానం లేదని మృతురాలి తమ్ముడు శివకుమార్ సోమవారం తిమ్మాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతురాలికి ఒక కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కోడేరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన నడిమింటి భరత్(39) మిత్రుడు అంజితో కలిసి పస్పుల గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. కల్లు తీసుకొని వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడి భరత్‌అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మహేశ్వరం (ఫైల్)

వెల్దండ: మండల పరిధిలోని చెర్కూర్ గ్రామానికి చెందిన గాజుల మహేశ్వరం (38) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం హైదరాబాద్‌లో వ్యాపారం చేసుకుంటూ జీవించేవాడు. ఆదివారం ప్రమాదవశాత్తు భవనంపై పడిపోయాడు. వెంటనే ఆస్పత్రిలో చేర్పించగా సోమవారం మరణించాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం


మృతుడు శివకుమార్ (ఫైల్)

నవాబుపేట: అప్పుల బాధ భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దొడ్డిపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలిలా.. దొడ్డిపల్లికి చెందిన సంపంగి శివకుమార్(20) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, శివకుమార్ ఇటీవల కుటుంబ పోషణ కోసం ఒక వాహనం కొనుగోలు చేశాడు. దానికి గాను అతడు ఒక బ్యాంకులో రుణం పొందాడు. కాగా బ్యాంకు వారు రుణ బకాయి చెల్లించాల్సిందిగా ఒత్తిడి చేయడం, అతడు ఉంటున్న ఇంటిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, వేలం వేస్తామని చెప్పడంతో మానసికంగా కుంగిపోయాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివకుమార్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. తన కుమారుడిని ఫైనాన్స్ వారు వేధించడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

జడ్చర్ల: బాదేపల్లి పాత బస్టాండ్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారు జా మున చోరీ చేసేందుకు యత్నించినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సంబంధిత సీనియర్ ఎగ్జిక్యూటివ్ మంగ నర్సింహులు గౌడ్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. చోరీకి య త్నించిన ఇద్దరు యువకులను, మోటార్ బైక్ ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఆస్పత్రికి వచ్చి.. యువకుడి హఠాన్మరణం

ఖిల్లాఘనపురం: అనారోగ్యంతో ఆస్పత్రిలో చూయించుకునేందుకు వచ్చిన వ్యక్తి హఠాత్తుగా మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎద్దుల రాము(28)కి అనారోగ్యంగా ఉండటంతో మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఆయుర్వేద ఆస్పత్రిలో చూయించుకునేందుకు వెళ్లాడు. ఆస్పత్రి మూసి ఉంటడంతో సమీపంలోని ఓ దుకాణం వద్ద కూర్చొని ఉండగా ఒక్కసారిగా నేలపై పడి గిలగిలా కొట్టుకుంటూ ప్రాణం వదిలాడు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు తారక్, కుమార్తె వర్షిణి ఉన్నారు.


కురుమూర్తిస్వామి ఆలయం వద్ద రాజగోపురానికి రంగులు వేస్తూ.. క్యూలైన్ రాడ్స్‌కు రంగులు అద్దుతూ.. మెట్ల సమీపాన పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కూలీలు

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

పేదల తిరుపతిగా పేరుగాంచిన అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 20 నుంచి బ్రహ్మోత్సవాలు, జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయానికి రంగులు వేయడం, చుట్టుపక్కల పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించడం లాంటి పనులు సోమవారం చేపట్టారు. అలాగే, ఆలయ మెట్ల వద్ద ఉన్న రాజగోపురం, మెట్లు, క్యూలైన్ రాడ్లు తదితర వాటికి రంగులు అద్దే పనుల్లో కూలీలు నిమగ్నమయ్యారు. జాతర మైదానంలో దుకాణ సముదాయాలు, పిల్లల ఆహ్లాదం కోసం రంగుల రాట్నం, తదితర వాటిని ఏర్పాటు చేసే పనిలో ఆయా నిర్వాహకులు నిమగ్నమయ్యారు. – చిన్నచింతకుంట

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- అదుపుతప్పి లారీ కిందపడిన బైక్


కోట్ర శివ (ఫైల్)

చారకొండ: బైక్ అదుపుతప్పి లారీ కిందపడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన దేవరకొండ మండలం కొండభీమనపల్లి శివారులో సోమవారం జరిగింది. పూర్తి వివరాలు.. మండల కేంద్రానికి చెందిన కోట్ర శివ(28) బైక్‌పై నల్లగొండ జిల్లా దేవరకొండకు వెళ్లి తిరిగి వస్తుండగా దారిలో ఓ మహిళకు లిఫ్ట్ ఇచ్చాడు. ఈ క్రమంలో కొండభీమనపల్లి వద్ద ముందు వెళ్తున్న లారీ ఓవర్ టేక్ చేసే క్రమంలో ముందుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పి లారీ కింద పడింది. ప్రమాదంలో బైక్‌పై ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది.

జూరాలకు 1.15లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


శ్రీశైలం ఆనకట్ట వద్ద దిగువకు విడుదలవుతున్న వరద

- 10 గేట్లు ఎత్తి 1.12 లక్షల క్యూసెక్కులు నీరు దిగువకు..
- 12 యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

గద్వాల/ఆత్మకూర్: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతుంది. సోమవారం జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. 10 గేట్లు ఎత్తి 1.12 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. అదేవిధంగా జల విద్యుదుత్పత్తి ద్వారా 38,651 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.336 టీఎంసీలు నిల్వ ఉంది. అదేవిధంగా సాగునీటి ప్రాజెక్టులైన నెట్టెంపాడు, భీమా లిఫ్ట్- 1, 2, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్, సమాంతర కాల్వలకు నీటిని పూర్తిగా నిలిపివేశారు. జూరాల ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

12 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 12 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని చేపట్టినట్లు జెన్కో ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. సోమవారం ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రాల ద్వారా మొత్తం 749.276 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేపట్టారు.

శ్రీశైలం ఆనకట్ట వద్ద ఒక్క గేటు ఎత్తివేత

దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి ప్రవాహం కొంత మేర పెరగడంతో సోమవారం శ్రీశైలం ఆనకట్ట వద్ద ఒక్క గేటును పైకెత్తి నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 71,820 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 38,651 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 8,892 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 క్యూసెక్కులు కలిపి మొత్తం 1.196 లక్షల క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయం చేరుతోంది. దీంతో శ్రీశైలం ఆనకట్ట ఒక్క గేటు పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వార 28,075 క్యూసెక్కుల వరద సాగర్‌కు విడుదల చేస్తున్నారు. భూగర్భ కేంద్రంలో 17.127 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 15.082 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తూ 27,330 క్యూసెక్కులు మొత్తం 62,645 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 885.0 అడుగులు, 215.8070 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 5 వేల, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,830 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

సుంకేసులకు 14వేల క్యూసెక్కులు

రాజోళి: సుంకేసులకు స్వల్పంగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. సోమవారం ఎగువ నుంచి 14,601 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. రెండు గేట్లను ఒక మీటర్ మేర తెరిచి 11,156 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు ఆయన తెలిపారు.

అన్యాక్రాంత ఆలయ భూమి స్వాధీనం


ఆలయ భూమిని పోలీసు బందోబస్తు నడుమ స్వాధీనం చేసుకుంటున్న ఆలయ అధికారులు

లింగాల: ఏళ్ల తరబడి అన్యాక్రాంతంగా ఉన్న ఆలయ భూమిని పోలీసు బందోబస్తు నడుమ ఆలయ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని కోమటికుంట ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్–165లో 12.35 ఎకరాల భూమిని కొన్నేళ్లుగా కొందరు అక్రమంగా సాగు చేసుకుంటున్నారు. ఆలయానికి ఎలాంటి ఆదాయం సమకూరకపోవడంతో దేవాలయ కమిటీ భూమి ఆక్రమణకు గురైందని హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు దేవాలయ కమిటీకి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో కోర్టు ఆదేశాల మేరకు అచ్చంపేట సీఐ నాగరాజు పర్యవేక్షణలో ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు నడుమ ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకున్నారు.

'చివరకు న్యాయమే గెలిచింది'

- అఖిల పక్ష జేఏసీ నాయకుడు వెంకట్రాంరెడ్డి
- ఆరున్నరేళ్లకు కేసు కొట్టివేయడంతో సంబరాలు


అఖిల పక్ష నాయకులను సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/నారాయణపేట: ఆరున్నరేళ్ల కిందట అఖిలపక్ష నాయకులపై పెట్టిన కేసులో చివరకు న్యాయమే గెలిచిందని అఖిల పక్ష జేఏసీ నాయకుడు వెంకట్రాంరెడ్డి పేర్కొన్నారు. కోయిల్‌కొండ మండలంలోని దమాయపల్లి గేటు వద్ద 2019లో జరిగిన నిరసనలో సీఐ పాండురంగాపై దాడి చేశారనే నెపంతో అఖిల పక్ష నాయకులపై పెట్టిన కేసును సోమవారం కోర్టు కొట్టి వేయడంతో మండలంలోని గార్లపహాడ్ గేట్ వద్ద అఖిల పక్ష నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణపేట జిల్లా ఏర్పాటు సమయంలో కోయిల్‌కొండ మండలాన్ని నారాయణపేట్ జిల్లాలో కలుపడాన్ని వ్యతిరేకిస్తూ మండల అఖిల పక్ష నాయకులందరం కలిసి పోరాటం చేయగా.. ఆ సమయంలో సీఐ పాండురంగారెడ్డిపై దాడి చేశారని 10మంది ఉద్యమకారులపై కేసులు నమోదు చేశారు. కేసులో సరైన సాక్ష్యాధారాలు లేనికారణంగా 10మందిపై ఉన్న కేసును కొట్టివేసిందని తెలిపారు. కేసు కొట్టి వేయడంతో అఖిల పక్ష నాయకులను సన్మానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోయిల్‌కొండ మండల అఖిల పక్ష జేఏసీ నాయకులు యాదిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, కృష్ణయాదవ్, రామకృష్ణారెడ్డి, నరేందర్, హనుమంతు, వెంకటేశ్, శ్రీనివాస్‌యాదవ్, కనకయ్య పాల్గొన్నారు.

అత్తను హత్య చేసిన కోడలి అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

వనపర్తి: వృద్ధాప్యంలో ఉన్న అత్తకు సేవ చేయాల్సిందిపోయి.. ఓ కోడలు అత్తపై విచక్షణారహితంగా దాడి చేసి చంపిన ఘటన రేవల్లి మండలం నాగపూర్‌లో చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు సోమవారం విలేకర్లకు వెల్లడించారు. రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన దొడ్డి ఎల్లమ్మ(75), దొడ్డి బొగురమ్మ అత్తాకోడళ్లు. కొంతకాలంగా అత్త ఎల్లమ్మ అనారోగ్యం బారిన పడడంతో మందులు, తినేందుకు డబ్బులు ఇవ్వాలంటూ తరచూ కోడలిని అడుగుతుండడంతో ఆమె విసుగుచెందింది. ఈనెల 4న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అత్తను చంపితే ఎలాంటి గొడవలు, ఇబ్బందులు ఉండవని నిర్ధారించుకుని ఇంట్లో, చుట్టుపక్కల ఎవరూ లేని సమయంలో కట్టె, రొట్టెలు చేసే ఇనుప పెంకుతో అత్త తలపై బలంగా కొట్టడంతో ఆమె మృతి చెందింది. ఈక్రమంలో మంచం, భూమిపై పడిన రక్తం మరకలను కోడలు తుడిచి ఏమీ తెలియనట్టుగా నటించింది. తన అత్త వృద్ధాప్యం మీద పడడం, అనారోగ్యంతో మృతిచెందిందని చుట్టుపక్కల వారికి, బంధువులకు చెప్పింది. వారు కూడా అదే నిజమని భావించారు. ఈక్రమంలో ఈ నెల 5న మృతురాలిని అంత్యక్రియలకు సిద్ధం చేసే క్రమంలో ఎల్లమ్మ తలకు రక్తగాయాలు కనిపించడంతో బంధువులు కోడలిని నిలదీశారు. బంధువులు దాడిచేస్తారని గమనించి కోడలు బొగురమ్మ అక్కడి నుంచి పారిపోయింది. ఈమేరకు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కోడలు బొగురమ్మను అదుపులోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టగా.. జడ్జి రిమాండ్‌కు తరలించాలని ఆదేశించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసు చేదించడంలో కీలక పాత్ర పోషించిన వనపర్తి సీఐ, కృష్ణయ్య, రేవల్లి ఎస్ఐ రజిత, పోలీసు కానిస్టేబుళ్లు, అంజనేయులు, రామకృష్ణ, మౌలానాను డీఎస్పీ అభినందించారు.

రైస్‌మిల్లులో షార్ట్ సర్క్యూట్

రూ.20 లక్షల ఆస్తి నష్టం


మిల్లులో విద్యుదాఘాతంతో కాలిన ప్యానల్ బోర్డు

ఖిల్లాఘనపురం: షార్ట్‌సర్క్యూట్‌తో రైస్ మిల్లు మోటార్లు, ప్యానల్ బోర్డు దగ్ధమైన ఘటన మండలంలోని సోళీపురంలో మంగళవారం జరిగింది. మిల్లు యజమాని నంద కిశోర్ తెలిపిన వివరాలు.. గ్రామంలోని ఐశ్వర్య రైస్‌మిల్లులో మంగళవారం ఉదయం 3 గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. మిల్లు నుంచి పొగలు రావడంతో స్థానికులు యజమానికి సమాచారం ఇచ్చారు. మిల్లు వద్దకు చేరుకున్న యజమాని పరిశీలించగా మూడు మోటార్లు, ప్యానల్ బోర్డు, వైరింగ్ పూర్తిగా దగ్ధమైనట్లు గుర్తించాడు. సుమారు రూ.20 లక్షల వరకు నష్టం జరిగిందని మిల్లు యజమాని తెలిపారు.

పోలీసులపై దాడి.. ముగ్గురికి రిమాండ్

జడ్చర్ల: పోలీసులపై దాడి చేసిన నిందితులకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గర గొడవ జరుగుతుందని ఆదివారం రాత్రి ఫిర్యాదు అందింది. దీంతో గొడవను నిలువరించడానికి వెళ్లిన పోలీసులపై వల్లూరు శ్రీకాంత్, బద్రి, పానుగంటి బాబులు దాడి చేయడంతో పాటు విధులకు ఆటంకం కల్పించారు. పోలీసు కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కాల్వలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన గ్రామస్తులు


కాల్వలో కొట్టుకుపోతున్న వ్యక్తిని తాడు సాయంతో కాపాడుతున్న గ్రామస్తులు

తిమ్మాజీపేట: మండలంలోని బాజీపూర్ సమీపంలో కాల్వలో సోమవారం రాత్రి కొట్టుకుపోతున్న వ్యక్తిని గ్రామస్తులు కాపాడారు. గ్రామస్తుల కథనం మేరకు.. వెంకాయపల్లికి చెందిన వెంకటయ్య మేస్త్రీ పనికి కుటుంబంతో బాజీపూర్ వెళ్లాడు. పనులు ముగించుకొని భార్య, కుమారుడితో బైక్‌పై రాత్రి 7.30 గంటలకు తిరుగు ప్రయాణంలో గొల్లవాని బావి దగ్గర కాల్వ దాటేందుకు ప్రయత్నించాడు. భార్య, కుమారుడు బైక్‌పై నుంచి దూకి కాల్వ ఒడ్డుకు చేరగా వెంకటయ్య కాల్వలో కొట్టుకుపోయాడు. ఈ క్రమంలో గ్రామస్తులు పలువురు గుర్తించి తాళ్ల సాయంతో కాల్వలో కొట్టుకు పోతున్న వెంకటయ్యను కాపాడారు. భారీ వర్షంతో గ్రామంలోని వీధులు కాల్వను తలపించాయి.

మక్తల్‌లో చోరీ

- ఐదు తులాల బంగారం, నగదు అపహరణ

మక్తల్: గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు విరగ్గొట్టి బంగారం, నగదు చోరీకి పాల్పడిన ఘటన మక్తల పట్టణంలోని న్యూ మారుతీనగర్ కాలనీలో చోటుచేసుకుంది. మక్తల్‌కు చెందిన వాకిటి సంతోష్ అనే వ్యక్తి దసరా పండుగకు అత్తగారి ఇంటికి వెళ్లాడు. ఆదివారం రాత్రి ఇంటి తాళాలు విరగ్గొట్టి ఇంట్లో ఉన్న బీరువాల తాళాలను విరగ్గొట్టి 5తులాల బంగారం, లక్ష రూపాయాలు నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం అత్తగారింటి నుంచి సాయంత్రం వచ్చే సరికే ఇంటి తాళాలు విరగ్గొట్టారు. ఇంట్లో చూసే సరికే సామగ్రి చిందరవదరం చేశారు. ఇంట్లో నాలుగు తులాల లాంగ్ చైన్, తులం నెక్లెస్, నగదు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై మక్తల్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ భాగ్య లక్ష్మిరెడ్డి అక్కడికి చేరుకొని ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడు వాకిటి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

4 కిలోల గంజాయి పట్టివేత


గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

వనపర్తి రూరల్: ఓ వ్యక్తి నుంచి 4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన పెబ్బేరు పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ఓ వ్యక్తి బస్సులో గంజాయి తరలిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న మల్లేష్ ప్రభుని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న బ్యాగును పరిశీలించగా 4 కిలోల గంజాయి ప్యాకెట్ కనిపించింది. దానిని స్వాధీనం చేసుకొని అతన్ని విచారించగా.. స్వస్థలం కర్ణాటక రాష్ట్రం బెంగళూరు అని, స్నేహితుడు దిలీప్ కాలేతో కలిసి ఒడిషాలోని మోహన్, అర్జున్ వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేశామని తెలిపారు. బెంగళూరులో ఎక్కువ రేటుకు విక్రయించేవాళ్లమని వివరించారు. అయితే, తన స్నేహితుడు దిలీప్‌కాలే పని ఉండడంతో మార్గమధ్యలో దిగిపోవడంతో బస్సులో తాను ఒక్కడినే వచ్చానని తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపారు.

వైద్యం వికటించి బాలుడి మృతి

ఆర్ఎంపీ ఇంటి ఎదుట బాధితుల ఆందోళన


మృతుడు వరుణ్ తేజ్ (ఫైల్)

జడ్చర్ల: జ్వరంతో బాధపడుతున్న ఓ బాలుడికి ఆర్ఎంపీ చికిత్స చేసిన తర్వాత మరింత అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృత్యువాత పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా.. మండల పరిదిలోని కుర్వపల్లి గ్రామానికి చెందిన భూపని కుర్మయ్య, మాధవి దంపతుల కుమారుడు వరుణ్‌తేజ్(11). బాలుడికి ఇటీవల జ్వరం రావడంతో సమీప గ్రామం కోడ్గల్‌లో ఆర్ఎంపీ శ్రీశైలం నిర్వహిస్తున్న సాయి క్లినిక్‌కు ఆదివారం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేయించుకున్న అనంతరం తిరిగి ఇంటికి వెళ్లిన కొద్ది సేపటికే బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మతిస్థిమితం కోల్పోయిన వాడిలా వ్యవహరించడంతో వెంటనే సంబంధిత ఆర్ఎంపీకి ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో ఆయన కుర్వపల్లికి చేరుకుని బాలుడికి ఇంజెక్షన్ చేశాడు. అయినా పరిస్థితి ఎలాంటి మార్పు రాకపోవడంతో జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి విషయం చెప్పడంతో అక్కడి డాక్టర్లు సంబంధిత ఆర్ఎంపీకి ఫోన్ చేసి అతను అందించిన చికిత్స వివరాలను ఆరా తీసి మందలించారు. పరిస్థితి విషమంగా ఉందని వెంటనే మెరుగైన ఆసుపత్రికి తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించడంతో అంబులెన్స్‌లో హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో బాలుడు మృతి చెందాడు. ఆర్ఎంపీ వైద్యం కారణంగానే తమ కుమారుడు మృతిచెందాడని తల్లిదండ్రులతో పాటు బంధువులు లింగంపేటలోని ఆర్ఎంపీ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో ఆర్ఎంపీ బాధిత కుటుంబానికి రూ.4.50 లక్షలు పరిహారం ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెల్సింది. బాలుడి తండ్రి కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు, బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య


రాములు(ఫైల్)

గోపాల్‌పేట: తాగింది సరిపోలేదని ఇంకా తాగేందుకు డబ్బులు అడిగితే భార్య డబ్బులు ఇవ్వలేదన్న మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తిలో సోమవారం చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని తాడిపర్తికి చెందిన పిచ్చుకుంట్ల రాముడు(40) సువర్ణ దంపతులు. కొంతకాలంగా రాముడు మద్యానికి బానిసయ్యాడు. ఇదేక్రమంలో ఆదివారం రాత్రి తాగాడు.. ఇంకా తాగేందుకు డబ్బులు కావాలని భార్యను అడిగాడు. భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో భార్యతో గొడవపడ్డాడు. ఆ తర్వాత అందరూ పడుకున్నాక ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి బయటకు వెళ్లిపోయి తాడిపర్తి చెరువులో పడ్డాడు. ఉదయం చెరువు వైపు వెళ్లిన గ్రామస్తులు చెరువు కట్టపై చెప్పులు, బట్టలు కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించి చెరువులో వెతకగా రాముడు బాడీ కనిపించింది. బయటకు తీసి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

మండలంలోని ఏదుట్లలో పాన్‌గల్ మండలంలోని కేతేపల్లికి చెందిన ఎడ్ల రాజ్‌కుమార్, ఏదుట్లకు చెందిన సంకెండ్ల పరశురాముడు, సూగూరు సాయి ముగ్గురు కలిసి వ్యవసాయం చేస్తున్నారు. ఇదేక్రమంలో ఆదివారం ఎడ్ల రాజ్‌కుమార్, సంకెండ్ల పరశురామ్ కలిసి రోటవేటర్ ట్రాక్టరుతో దున్నేందుకు పొలంవద్దకు వెళ్లారు. రాజ్‌కుమార్ రోటవేటర్‌ను సరిచేస్తుండగా పరశురాముడు అజాగ్రత్తగా ముందుకు నడిపాడు. దీంతో రాజ్‌కుమార్ రోటవేటర్‌లో పడి మృతిచెందాడు. సోమవారం బాధితుడి తండ్రి అగ్గిరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

షెడ్డులోకి దూసుకెళ్లిన డీసీఎం.. ఇద్దరికి గాయాలు


రేకుల షెడ్డులోకి దూసుకెళ్లిన డీసీఎం

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న డీసీఎం వాహనం అదుపుతప్పి ఓ రేకుల షెడ్డులోకి దూసుకెళ్లడంతో భార్యాభర్తకు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం జరిగింది. కడప జిల్లా ఒంటిమిట్ట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న డీసీఎం వాహనం ఉండవెల్లి శివారులోకి రాగానే పత్తి మిల్లు ముందు ఉన్న షెడ్డులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో షెడ్డులో ఉన్న వీరా సింగ్, భాగ్యమతి దంపతులకు తీవ్ర గాయాలు కాగా కర్నూలు ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ శ్రీశైలం నిద్రమత్తులో వాహనం నడపడంతోనే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శేఖర్ పేర్కొన్నారు.